క్లుప్తంగా

ఇప్పటూర్‌లో తాగునీటి ఏర్పాటు



నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడిపై మంగళవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. దీంతో బుధవారం మండల అధికారులు గ్రామంలో తాత్కాలికంగా బోరు రిపేరు చేయించి తాగునీటి ఏర్పాటు చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవటం, గ్రామంలో ఉన్న బోర్లు మొరాయించటంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సంబంధిత అధికారులు బోర్లు రిపేరు చేయించి నీటిని అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాంనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమీయుల్లా, పంచాయతీ అధికారి కల్పన, తదితరులు ఉన్నారు.

ఇసుక అనుమతులు రద్దు చేయాలి

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పట్టా భూముల్లో ఇచ్చిన ఇసుక అనుమతులు రద్దు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. మండలంలో ఇసుక, ఎర్రమట్టి, మొర్రం అక్రమంగా రవాణా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు తిరుపతి, నాయకులు నరేష్, జంగిలయ్య, అరవింద్, భీమయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, నవీన్,పాల్గొన్నారు.

పోమాల్‌లో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నవాబుపేట: మండలంలోని పోమాల్ గ్రామంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో ప్రత్యేక హోమం, పూజలు చేసి హనుమాన్ దేవాలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, కాంగ్రెస్ మండల నాయకులు సత్యం, నర్సింహ, ఆనంద్, నరేష్, కుమార్, చంద్రయ్య, మల్లేష్, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

దివిటిపల్లి బ్రిడ్జిపై ప్రమాదం

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ మండలం దివిటిపల్లి వద్దనున్న 44వ జాతీయ రహదారి బ్రిడ్జిపై బుధవారం రాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీ అతివేగంతో అదుపుతప్పి బ్రిడ్జి (వన్‌వే)పై ఏర్పాటుచేసిన దిమ్మెలను బలంగా ఢీకొట్టడంతో అవతలి వైపు భూత్పూర్ నుంచి జడ్చర్లవైపు వెళ్తున్న కారుకు దిమ్మెలు తగిలాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న చంద్రయ్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బ్రిడ్జిపై ఉన్న వన్‌వేలో ఓవైపు కారు, మరోవైపు లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో లారీ, కారును పక్కకు తొలగించారు. దాదాపు గంట పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కూచూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. కూచూర్‌కు చెందిన సలెంద్రపల్లి యాదయ్య (54) ఈ నెల 2వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి మేడపై నిద్రించాడు. కాగా తెల్లవారుజామున ఇంటిపై నుంచి కిందకి దిగుతుండగా కాలుజారి మేడపై నుంచి పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ బాధితుడు బుధవారం మృతి చెందాడు. దీంతో మృతుడి కుమార్తె లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున కోయిలకొండ వైపు నుంచి ఓ లారీ ఇసుక లోడుతో వస్తుండగా తనిఖీలు చేయగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు లారీ సీజ్ చేయడంతోపాటు డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

కొనుగోలు..‘గగ్గోలు’

- తాలుపేర ‘తరుగు’
- కూలీల కొరతతో ఆలస్యం
- ఐకేపీ కేంద్రాల్లో టార్పాలిన్‌లు కరువు
- అధికారుల నిర్లక్ష్యం.. రైతుల నిర్వేదం



ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

గండీడ్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. తాలు పేరుతో తరుగు తీయడంతో పాటు కూలీల కొరత వేధిస్తోంది. టార్పాలిన్‌లు కూడా లేకపోవడంతో అన్నదాత ఆగమవుతున్నాడు. కేంద్రాల వద్ద నీడ అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని దిశానిర్దేశం చేసినా ఆచరణలో మాత్రంలో కానరావడం లేదు. కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కిందిస్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా రైతులు అవస్థలు పడక తప్పడం లేదు. గండీడ్ మండలంలో ఈ సీజన్‌లో 7500 ఎకరాల వరి సాగైంది. ఈ ధాన్యం కొనుగోలు చేయడానికి గాను 19 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12 కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొంరెడ్డిపల్లి, బల్సుర్‌గొండ, రెడ్డిపల్లి, లింగాయిపల్లి, పెద్దవార్వాల్, రంగారెడ్డిపల్లి, వెన్నాచేడ్ తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

తాలు పేరిట తరుగు..

ఆది నుంచి రైతు దోపిడీకి గురవుతూనే ఉన్నాడు. రేయింబవళ్లు కష్టపడి పంటను పండిస్తే తాలు పేరిట తరుగు తీస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 కిలోల 700 గ్రాములు పెట్టాల్సి ఉండగా, పలుచోట్ల 42 కిలోలు పెడుతున్నారు. తూర్పు పడితే 41 కిలోల 300 గ్రాముల వరకు పెడుతున్నారు. కిలోపై తరుగు తీస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో అంతకంటే ఎక్కువ కూడా తరుగు తీస్తున్నారు. ముఖ్యంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. మిల్లర్లతో మాట్లాడుకొని ఇక్కడ తూకం 41 కిలోల పైన వేసి అక్కడికి వెళ్లాక తూర్పుపట్టని వాటికి అదనంగా మరో కిలో తరుగు తీస్తున్నారు. ఇలా తీసిన వాటిని వేరే రైతుల పేర వేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూలీల కొరత..

కొనుగోలు కేంద్రాల్లో కూలీల కొరత నెలకొంది. దీంతో తూకం ఆలస్యం అవుతున్నది. ముఖ్యంగా



లింగాయిపల్లిలో ధాన్యం నింపుతున్న రైతులు

పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాల్లో ఈ సమస్య నెలకొంది. ప్రతిసారి బిహార్ కూలీలు తూకాలు వేసేందుకు వచ్చేవారు. ఈసారి వారి సంఖ్య తగ్గడంతో కొన్ని చోట్ల దాదాపు ఇరవై రోజులకు పైగా పడుతున్నది. అసలే ఎండలు దంచి కొడుతుండడంతో పాటు సాయంత్రం కాగానే ఉరుములు మెరుపులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొని చోట్ల ధాన్యం తడిసి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. తేమ శాతం నిబంధనల మేరకు ఉన్నా సకాలంలో తూకాలు వేయడకపోవడంతో పెట్టిన దగ్గరే ధాన్యం తూకం తగ్గిపోతున్నది. పలుచోట్ల ఏఈఓలు టోకన్ల జారీలో ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐకేపీ సెంటర్లకు సరఫరా కాని టార్పాలిన్‌లు..

ప్రతిసారి కొనుగోలు కేంద్రాలకు టార్పాలిన్‌లు సరఫరా చేసేవారు, కాని ఈసారి ఐకేపీ కేంద్రాలకు ఒక్కటి కూడా ఇవ్వలేదు. కొనుగోళ్లు ముగియగానే మార్కెటింగ్ వాళ్లకు వాటిని అప్పజెపితే తిరిగి కొనుగోళ్లు ప్రారంభం కాగానే కొత్తవి ఇచ్చేవారు. సంబంధిత అధికారులను అడిగితే ఈరోజు రేపంటున్నారు తప్ప ఇవ్వడం లేదు. అవి తీసుకరాకపోగా రైతులు ఒకరివి ఒకరు సర్దుకోవాలని మండలస్థాయి అధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సెంటర్ల కోసం 50 టార్పాలిన్‌లు కొనుగోలు చేసినా పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. ధాన్యం పోయే వరకు రైతులదే బాధ్యత అని రుద్దుతున్నారు. తూకం వేసిన తర్వాత ధాన్యం తడవకుండా చూసుకోవాల్సి బాధ్యత ఆయా కేంద్రాలదే అయినా ఆ భారం రైతుల మీదే మోపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పలుచోట్ల ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అదనంగా 27 కిలోలు తరుగు తీశారు..



ఎకరన్నర వరి వేశాను. ధాన్యం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న బల్సుర్‌గొండ కొనుగోలు కేంద్రానికి తరలించాను. తూకం వేస్తే 40 కిలోల బస్తాలు 93 అయ్యాయి. వాటిలో తూర్పు పట్టనందుకు ఒక బస్తాకు ఒక కిలోతో పాటు అదనంగా 27 కిలోలు తరగు తీశారు. 90 బస్తాలకు రశీదు ఇచ్చారు. 3 బస్తాలు అంటే మొత్తం 120 కిలోలు తరుగు తీశారు. మీద తరుగు తీసిన 27 కిలోల గురించి అడిగితే లోడు మొత్తానికి తరుగు వచ్చిందని, అందుకే 27 కిలోలు తగ్గించాల్సి వచ్చిందని చెబుతున్నారు.

– కల్యాణ్‌రెడ్డి, రైతు, బల్సుర్‌గొండ

టార్పాలిన్లు కొత్తవి ఇస్తే తీసుకొస్తాం..

టార్పాలిన్లు పాతవి తీసుకుపోమన్నా రు. అవి పూర్తిగా చినిగిపోయి ఉన్నాయి. అందుకే వాటిని తీసుకురాలేదు. కొత్తవి ఇస్తే వాటిని కొనుగోలు కేంద్రాలకు అందజేస్తాం.

– బాలకృష్ణ, ఏపీఎం, గండీడ్

42 కిలోలు పెట్టడం లేదు..

పీఏసీఎస్ కేంద్రాల్లో ఎక్కడ కూడా 42 కిలోలు పెట్టడం లేదు. తూర్పు పట్టని వారు మిల్లు వారితో మాట్లాడుకుంటే అది మాకు సంబంధం లేదు. నిబంధనల ప్రకారం తూకం వేస్తున్నాం. టార్పాలిన్లు ప్రతి సెంటరుకు ఇచ్చాం. తూకం వేసిన తర్వాత వాటిపై కేంద్రం టార్పాలిన్ కప్పుతున్నాం.

– లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్, గండీడ్

కూలీలు లేరని ఆలస్యం చేస్తున్నారు..



మూడు వారాల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. ధాన్యం తూర్పు కూడా పట్టాం. తూకం వేయమంటే ఈరోజు రేపంటూ దాట వేస్తున్నారు. సాయంత్రం కాగానే మబ్బులు కమ్ముకుంటున్నాయి. దీంతో ఎప్పుడు వర్షం వస్తుందో అని కంటిమీద కునుకు లేకుండా ఉంది. చేసేది లేక మేమే మిల్లుకు నేరుగా తీసుకెళ్లాలని నింపుతున్నాం. ఇక్కడ రైతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

– వెంకటయ్య, రైతు, లింగాయిపల్లి

పట్టణంలో లో ఓల్టేజీకి చెక్



లక్ష్మీనగర్ కాలనీ కొత్త ట్రాన్స్‌ఫార్మను అమర్చుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎండా కాలంలో జిల్లా కేంద్రంలో లో ఓల్టేజీ సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏడీ తవుర్యానాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన లో ఓల్టేజీ సమస్య ఉండేదని తెలిపారు. దీంతో లక్ష్మీనగర్ కాలనీ వాసులు సమస్యను ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో ఎలాంటి లోఓల్టేజీ సమస్య లేకుండా పోయిందన్నారు. పట్టణంలో ఎక్కడా లో ఓల్టేజీ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ అరుణ్‌కుమార్, కాలనీ వాసులు శంకర్‌నాయక్, వెంకట్‌రాములు, రాందాస్, హేమచందర్, కొండన్న, బిచ్చయ్య, మహర్షి ఏడీ తౌర్యా నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

‘ఫోరం’ సేవలు చిరస్మరణీయం

- ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి



అంబేడ్కర్‌చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ‘ఫోరం’ సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం చేస్తున్న సేవలు చిరస్మరణీయమని ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి అన్నారు. ట్రాఫిక్ పోలీసుల కోసం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం బుధవారం 30వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎర్రటి ఎండలో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులకు ఈ శిబిరం ఎంతో ఊరటనిస్తోందన్నారు. అనంతరం ‘ఫోరం’ అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకు, కాలినడకన వెళ్లే వృద్ధులకు సైతం మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఎండాకాలం ముగిసేవరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సభ్యులు ఎ.రాజసింహుడు, బుచ్చన్న, కోటిరెడ్డి, టి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో ఏర్పాట్ల పరిశీలన



పిల్లలమర్రి ప్రాంగణంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం శివారులోని పిల్లలమర్రి లో కొనసాగుతున్న ఏర్పాట్లను బుధవారం మధ్యాహ్నం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ కార్పొరేషన్ క మిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పరిశీలించా రు. ఈనెల 16న ఇక్కడి మహావృక్షాన్ని ప్రపంచ సుందరీమణుల పోటీదారులు సందర్శించనున్న విషయం విదితమే. వీరి రాకను పురస్కరించుకుని పిల్లలమర్రి ప్రాంగణ ంతో పాటు రాజరాజేశ్వర ఆలయం, పురావస్తుశాఖ ఆధ్వర్యంలోని మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య పనులు, పార్కింగ్, పగోడాలకు గడ్డితో పైకప్పు, గోడలకు ముగ్గులు, సేద దీరేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 3 రోజుల రిమాండ్

మిడ్జిల్: మండల కేంద్రంలో ఈనెల 12న పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పాన్‌గల్ మండలం కల్వరాల గ్రామానికి చెందిన సంపగి యాదగిరి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో అతనిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పర్చారు. జడ్జి అతనికి రూ.2వేల జరిమానా, 3రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

రాజాపూర్: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించేందుకు వీలుంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులను వాడాలని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజాపూర్ మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెతులు తమ ఆధార్ కార్డుతో పాటు, రైతు పట్టాబుక్కు తీసుకెళ్లి గ్రామాల ఏఈఓలను సంప్రదించాలని పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు 30 కేజీలకు రూ.2137.50, జనుము విత్తనాలు 40 కేజీలకు రూ.2510 చెల్లించి రైతులు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

జూలపల్లిలో కరెంటు కష్టాలు

మహమ్మదాబాద్: నిత్యం విద్యుత్ సరఫరా చేయాల్సిన అధికారులు ఎలాంటి కారణాలు లేకుండా గంటల తరబడి కోతలు విధిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహులు తెలిపారు. మండలంలోని జూలపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కల్గించడంతో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ గంటల తరబడి కోతలు విధిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నారని ఆయన తెలిపారు. ఈవిషయంలో ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతలు విధించకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మిడ్జిల్: మండలంలోని కొత్తూర్ గ్రామ శివారులో బుధవారం అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

అందరిపై పోచమ్మతల్లి అనుగ్రహం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శీతలాదేవి–పోచమ్మతల్లి అనుగ్రహం అందరిపై ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక పాతపాలమూరులోని శీతలాదేవి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఈ ఆలయం కో సం ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.9లక్ష లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం పాలకొండ లోని చౌడేశ్వరిమాత ఆలయంలో వార్షికోత్సవ ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమా ల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యా దవ్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బెక్క రి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

ఎప్‌సెట్, సీబీఎస్‌ఈలో ఉత్తమ ఫలితాలు సాధించిన ‘రిషి’, ‘ఎంబీహెచ్‌ఎస్’ విద్యార్థులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. స్థానిక రిషి జూనియర్ కళాశాలకు చెందిన స్వర్ణకుమారి రాష్ట్ర స్థాయి (అగ్రికల్చర్ విభాగం)లో 73వ ర్యాంకు, ప్రజీత్‌కుమార్‌రెడ్డి (ఇంజినీరింగ్ విభాగం)లో 1521వ ర్యాంకు సాధించారు. పదోతరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో మౌంట్ బాసిల్ హైస్కూల్ (ఎంబీహెచ్‌ఎస్)కు చెందిన విద్యార్థులు ఎస్.సాయిశ్రీచరణ్‌కు 500లకు గాను 492 మార్కులు, పి.చేతన్‌కు 484 మార్కులు వచ్చాయి. వారితో పాటు తల్లిదండ్రులు, కళాశాల, పాఠశాల యాజమాన్యం బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఈ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, డైరెక్టర్లు శిరీషప్రవీణ్‌కుమార్, పూజితామోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్స్ భూపాల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- భూమి, చెక్‌బౌన్స్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలి
- జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక



భూత్పూర్‌లో మాట్లాడుతున్న జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక

భూత్పూర్: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, భూములు, చెక్‌బౌన్స్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రైతులు చిన్న గెట్టు పంచాయతీలు, స్త్రీలు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల కోర్టులను ఆశ్రయించాలంటే ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లయితే మండల లీగల్ అథారిటీ సభ్యులను ఆశ్రయించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. రాజీమార్గం ద్వారా కేసులు త్వరిత గతిన పరిష్కారమౌతాయని, రాజీమార్గంలో గెలుపు, ఓటములు కాదని భావించి, దీర్ఘకాలికంగా ఉన్న కేసులు పరిష్కరించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి లీగల్ లిటరసీ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జడ్జి తెలిపారు. గ్రామపెద్దలు, విద్యావంతులు కోర్టు కేసులు, పరిష్కారంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ ప్రభాకర్, ఎస్‌ఐ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, లీగల్ అడ్వైజర్ రవికుమార్ గౌడ్, డిప్యూటీ లీగల్ కౌన్సిల్ మల్లిక్ షాకీర్, ప్రైవేట్ లీగల్ అడ్వైజర్ నాగభూషణం, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మున్సిపల్ అధికారులు, తదితరులు ఉన్నారు.

ఎర్రసత్యం స్మారక బస్టాండ్ పునఃనిర్మించాలి



బస్‌షెల్టర్ నిర్మాణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై రెండు దశాబ్దాలకు పైగా ఉన్న ఎర్రసత్యం స్మారక బస్టాండ్‌ను పునఃనిర్మించాలని ముదిరాజ్ సంఘం నాయకులు, ఎర్రసత్యం అభిమానులు డిమాండ్ చేశారు. సిగ్నల్‌గడ్డపై ఎంపీడీఓ కాంప్లెక్స్ పరిధిలో లయన్స్‌క్లబ్ బస్టాండ్ నిర్మాణం చేపట్టడంపై బుధవారం సాయంత్రం ముదిరాజ్ సంఘం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. లయన్స్‌క్లబ్ నిర్మిస్తున్న బస్‌షెల్టర్ వద్ద వారు నిరసన తెలిపారు. 25 ఏళ్లకుపైగా ఉన్న బస్టాండ్ రోడ్డు విస్తరణలో తొలగించారని, దాని స్థానంలో పునఃనిర్మాణం చేయిస్తామని జాతీయ రహదారుల శాఖ అధికారులు హామీ ఇచ్చారని, దానిని విస్మరించడం తగదన్నారు. ఇదే తరుణంలో లయన్స్‌క్లబ్ బస్‌షెల్టర్ నిర్మాణానికి పూనుకోవడంపై ముదిరాజ్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే పనులు నిలిపేయాలని, ఇదే స్థలంలో ఎర్రసత్యం స్మారక బస్టాండ్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేణుక, మాజీడిప్యూటీ సర్పంచ్ కోళకృష్ణ, నాయకులు నర్సింహులు, అరవిందమ్మ, యాదయ్య, పర్వవేది, శివ, జయపాల్, అనిల్, మురళి, బాల్‌రాజ్, అనంత్‌కిషన్, శ్రీను, వెంకటేష్, బాలకృష్ణ, చెన్నయ్య పాల్గొన్నారు.

బానిస యుగంలోకి కార్మికులు



మాచన్‌పల్లిలో సమ్మె బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు



అడ్డాకులలో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కార్మికులు



కొకుంట్లలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మిక సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రోజుకు రూ.178ల వేతనం నిర్ణయించడం కార్మికులను దగా చేయడమేనని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లిలో ఈనెల 20న చేపట్టే సమ్మె బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకుండా వారి శ్రమను దోపిడీ చేసే రకంగా లేబర్ కోడ్లు తెస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు, యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి కార్మికులను బానిస యుగంలోకి నెడుతున్నారన్నారు. రోజుకు 8 నుంచి 12, 14 గంటలు పనులు చేయించుకోవడం, వెట్టిచాకిరి చేయడం, సంపదను ఆదాని, అంబానీలకు కట్టబెట్టి వారికే రాయితీ కల్పించి రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. కార్మికులు తిరుగుబాటు చేసి హక్కులను కాపాడుకోవాలని, రైతు కూలీలు ఐక్యంగా ఈనెల 20న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, నాయకులు ఖాదరయ్య, బాలకృష్ణగౌడ్, రామచంద్రయ్య, లింగంగౌడ్, నగేష్, యాదయ్య పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ విడుదల

దేవరకద్ర: కార్మికుల సమస్యపై ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు మద్దతుగా కొకుంట్ల మండల కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు కోరారు. కార్యక్రమరంలో బుచ్చన్న, నర్సింహులు, కురుమూర్తి, రాజు, జయరాజు, మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేత

అడ్డాకుల: ఈనెల 20న నిర్వహించే సమ్మెకు సంబంధించిన నోటీసును అడ్డాకులలో ఎంపీడీఓకు అందజేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు మాట్లాడారు. రైస్‌మిల్లు, హమాలీ, ఆటో, భవన నిర్మాణ, కార్మికులకు నెలకు రూ. 26వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్మయ్య, చంద్రయ్య, బాలమశన్న, వెంకటన్న, రాములు, మైబన్న, మణెమ్మ, దేవమ్మ, కురుమన్న, శంకర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మికులను విస్మరించింది

చిన్నచింతకుంట: ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సంఘాల సమ్మె వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏఐటీయూసీ సంఘం జిల్లా కార్యదర్శి పి.సురేష్ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను పూర్తిగా విస్మరించిందన్నారు. ఈనెల 20న దేశ వ్యాప్తంగా సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అమరజ్యోతి, నాయకులు జి. శ్రీనివాస్, దేవానంద్, తిరుపతయ్య, వెంకటేష్, రాము, కృష్ణయ్య, రాంబాబు ఉన్నారు.